## నర్సంపేట భారీగా తరలివచ్చిన జనం




# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం , 01 ఆగస్టు-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా





# గోదావరి వరద ఉధృతి



- ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం
- గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి
- ఖమ్మం కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి ఆదేశాలు

3లో..

### బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే
# పెద్ది కన్నుమూత

- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- అభిమాన నాయకుడు మరణంతో విషాదం



**వరంగల్,జూలై31 :** తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలి చిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి మిగతా 3లో..

# ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సిఎం దృష్టి

- టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత
- డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ
- స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జూలై 31 :** టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజే యాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శు క్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశా రు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూని వర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్ షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటె క్నిక్ విద్యా ర్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశ పెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళా శాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొ న్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్



- దేశ జీడీపీలో తెలంగాణ వాటాను పదిశాతం పెంచడమే లక్ష్యం
- పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రదేశం
- సిఐఐ ప్రతినిధుల భేటీలో సిఎం రేవంత్ రెడ్డి

మిగతా 3లో..

### కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల
# పథకాలు, ప్రాజెక్టులు

- ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు
- పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు
- కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ,జూలై31:** కేంద్ర కేబినెట్ నేడు రూ. 4.5లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజె క్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయి ంపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎలోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని మిగతా 3లో..

### కాళేశ్వరం వద్ద
# గోదావరి ఉధృతి



**కాళేశ్వరం,జూలై31 :** ఎగువ ప్రాం తాల్లో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభా వంతో కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉధృ తంగా ప్రవహి స్తోంది. శుక్రవారం ఉదయం 9:00 గంటలకు సీడబ్ల్యూసీ కాళేశ్వరం స్టేషన్ వద్ద గోదావరి నీటిమట్టం 11.50 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ప్రాం తంలో వాతా వరణం మేఘా వృతంగా ఉంది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 96.40 మీటర్లు నమో దైంది. బ్యారేజ్ వద్ద మొత్తం 8,35,800 క్యూసె క్కుల వరద ప్రవాహం ఇన్‌ఎలో, అవుట్‌ఎ లోగా కొనసాగుతుండగా, వరద నీటిని దిగు వకు విడుదల చేసేందుకు 85 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచారు. ప్రస్తుతం గోదావరి నది బ్యారేజ్ వద్ద ఫ్రీ ఎలో పరిస్థితిలో ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద హెచ్చరిక స్థాయి 12.210 మీటర్లు, ప్రమాద స్థాయి 13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మిగతా 3లో..

# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

### ఆగస్ట్ చివరలో నిర్మాణ్యాలకు శ్రీకారం
### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్,జూలై31 :** ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొం గులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ పక్రియ ప్రారంభం చేస్తామ న్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. మిగతా 3లో..

# హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

### అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్,జూలై31 :** తెలంగాణ ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్‌పై రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగంపై సంబంధిత అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలు అశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశర చేశారు. చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్షకు నిర్ణయించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎస్ సంజయ్ జాజు మార్గనిర్దేశర చేశారు. 24 గంటల హెల్ప్ సిస్టమ్, వేగవంతమైన అనుమతి పక్రియ చేపట్టాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ట్రస్ట్ నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. మిగతా 3లో..

### నాంపల్లి ఎసిబి కోర్టుకు
# హాజరైన కెటిఆర్



- ఫార్ములా ఈ రేస్ కేసు తదుపరి విచారణ 25కు వాయిదా

**హైదరాబాద్,జూలై31 :** ఫార్ములా–ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వ కుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఏసీబీ కోర్టు నోటీసులతో తొలిసారిగా విచారణకు కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఫార్ములా–ఈ రేస్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కార్ రేస్‌తో ఊఓఆంకు రూ. 54.88 కోట్ల నష్టం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఈఇక్ష కంపెనీని నిందితులుగా ఏసీబీ అధికారులు ఈ కేసులో చేర్చారు. ఛార్జ్‌షీట్ ధాఖలు చేసిన తర్వాత మొదటి కేసును న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ ఛార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకున్నామని కోర్టు తెలిపింది. తదుపరి ఈ కేసులో ట్రయల్ మొదలు పెట్టనుంది. తదుపరి విచారణను ఆగస్టు25వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. కేటీఆర్ లక్ష పూచీకత్తు , 2 షూరిటీస్ సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.

# పెద్దిరెడ్డి మృతికి సిఎం రేవంత్ సంతాపం



**హైదరాబాద్,జూలై31:** నర్సంపేట మాజీ ఎమ్మె ల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీ యమని సీఎం పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యు లకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

- అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వైనరీల ఏర్పాటుకు అవకాశం
- ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం.. స్థానికంగా ఉపాధి అవకాశాలు



**హైదరాబాద్,జూలై31** తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు. సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ పక్రియను అధ్యయనం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధు లతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, మిగతా 3లో..

# నకిలీ ఎరువులు కొని మోసపోవద్దు



## లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే కొనండి

### రైతులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక

హైదరాబాద్,జూలై31 : తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లోని రైతులు.. నకిలీ ఎరువులు కొనుగోలు చేసి.. ఇబ్బంది పడుతున్నట్లు వ్యవసాయశాఖకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ వెంటనే అప్రమత్తమైంది. దాంతో రైతులకు కీలక సూచనలు చేసింది. నకిలీ డీఏపీ ఎరువులు కొనుగోలు చేయవద్దని రైతులకు స్పష్టం చేసింది. లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనాలని సూచించింది. ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత.. బిల్లు తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోవాలని విజ్ఞప్తి చేసింది. తక్కువ ధర పేరుతో ఎరువులు కొని మోసపోవద్దని రైతులకు తెలంగాణ వ్యవసాయ శాఖ వివరించింది. రహదారి పక్కన, లారీల్లో విక్రయించే ఎరువులు కొనవద్దని రైతులకు విజ్ఞప్తి చేసింది. అలాగే ఎరువుల సంచిపై తయారీ, గడవు తేదీలతోపాటు ఎంఆర్‌పీ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని రైతులను కోరింది. అనుమానాస్పద ఎరువుల బస్తాలను గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించింది. తక్కువ ధర పేరుతో మోసాలకు గురికావద్దని రైతులను హెచ్చరించింది. జిల్లాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. అప్రమత్తతే రైతుల పెట్టుబడికి రక్షణ అని స్పష్టం చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అయితే రాష్ట్రంలోని ఐదు జిల్లాలు ముఖ్యంగా రంగారెడ్డి, సూర్యాపేట, కరీంనగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో నకిలీ ఎరువుల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో నకిలీ ఎరువుల విక్రేతలపై కేసులు నమోదు చేశారు. అలాగే నిందితులను అరెస్ట్ చేశారు. వారు నిల్వ చేసిన ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకుని.. వాటిని సీజ్ చేశారు.

# ఉజ్జయిని మహంకాళి బోనాలు



## 2 నుంచి 4 వరకు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్,జూలై31 : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఆగస్టు 2 ఆదివారం నుంచి 4 మంగళవారం వరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా మహంకాళి ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. పొగాకు బజార్, సుభాష్ రోడ్, హిల్ స్ట్రీట్ రహదారులను తాత్కాలికంగా మూసివేయనుండగా, జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయం వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. ప్యాట్నీ, ప్యారడైజ్, రాణిగంజ్, ఘాస్‌మండి, బైబిల్ హౌస్, కర్బాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. భక్తుల సౌకర్యార్థం హరిహర కళాభవన్, మహబూబ్ కాలేజీ, సీఎంఆర్ మాల్, వెస్లీ కాలేజ్, జింఖానా గ్రౌండ్, స్వప్నలోక్‌తో పాటు మొత్తం 14 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్యాట్నీ నుంచి ట్యాంక్‌బండ్ వెళ్లే వాహనాలను ప్యారడైజ్, క్లాక్ టవర్ మీదుగా మళ్లించనుండగా, ప్యారడైజ్ నుంచి ఎంజీ రోడ్ వెళ్లే వాహనాలను సింధీ కాలనీ మీదుగా డైవర్ట్ చేయనున్నారు. అలాగే ఆర్టీసీ బస్సులకు కూడా ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణాన్ని ఎ÷-లాన్ చేసుకుని, ట్రాఫిక్ పోలీసుల సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని అధికారులు సూచించారు.

# నకిలీ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం



## విస్తృతంగా తనిఖీలు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్,జూలై31 : హైదరాబాద్ నగరంలో వాహనాల నకిలీ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజులుగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ నంబర్ ప్లేట్లు వినియోగిస్తున్న ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సుల్తాన్‌బజార్, మెహదీపట్నం, బహదూర్‌పురాతో పాటు పెద్దపల్లి, మేడిపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదు చేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ప్రభుత్వం ఆమోదించిన హెచ్‌ఎస్‌ఆర్‌పీ నంబర్ ప్లేట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. ఊ÷ూఖీఖ కాకుండా ఇతర నంబర్ ప్లేట్లు వాడితే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు, డిజైన్లతో పాటు అంకెల మార్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లు వాడితే వాహనం సీజ్‌తో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. చలానాల నుంచి తప్పించుకునేందుకు కొంతమంది వాహనదారులు నంబర్ ప్లేట్లు మారుస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు తనిఖీల్లో గుర్తించారు. ఈ నేపథ్యంలో 'జీరో టాలరెన్స్' విధానంతో ముందుకు వెళ్తున్నట్లు ఈ సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

# తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం
- పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత





హైదరాబాద్,జూలై31 : పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నిబద్ధత కలిగిన ఉద్యమనాయకుడు పెద్ది

## పెద్ది మృతికి కెటిఆర్ తీవ్ర సంతాపం



హైదరాబాద్,జూలై31 : తెలంగాణ ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తనను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి, విషాదానికి గురిచేసిందని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశాం.. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కేటీఆర్ అన్నారు. ఉద్యమ ఆశయాలను జీవితాంతం నమ్మి, ప్రజల పక్షాన నిలబడి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికి కూడా తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. ఆయన చూపిన నిబద్ధత, సేవా తపన, ఉద్యమ స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కేటీఆర్ ప్రార్థిం చారు. వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు.

# ఉద్యమ సహచరుడిని కోల్పోయా

## పెద్ది మృతికి హరీష్ సంతాపసం

హైదరాబాద్,జూలై31 : ఉద్యమ సహచరుడు, సోదరుడు, మంచి మనసున్న మనిషి పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమ యంలో మృత్యువును జయించి తిరిగి వస్తారనే ఆశతో మనమంతా ఎదురుచూశాం. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్తను జీర్ణించుకోవడం ఎంతో కష్టంగా ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని జీవితాంతం నిలబెట్టిన పోరాట యోధుడిగా, ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన సోదరుడిగా పెద్ది సుదర్శన్ అన్న ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతారని హరీశ్‌రావు అన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా నాకు ఒక ఉద్యమ సహచరుడిని, ఆత్మీయ సోదరుడిని కోల్పోయిన బాధ ఇది అని అన్నారు. పెద్ది సుదర్శన్ అన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ? వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని హరీశ్‌రావు తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు. పెద్ది అన్నకు జోహార్లు తెలిపారు.

# నిబద్ధత కలిగిన ఉద్యమనాయకుడు పెద్ది

## పెద్ది మృతికి కెటిఆర్ తీవ్ర సంతాపం

హైదరాబాద్,జూలై31 : తెలంగాణ ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తనను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి, విషాదానికి గురిచేసిందని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశాం.. కానీ, ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కేటీఆర్ అన్నారు. ఉద్యమ ఆశయాలను జీవితాంతం నమ్మి, ప్రజల పక్షాన నిలబడి, పార్టీ బలోపే ఎతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికి కూడా తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. ఆయన చూపిన నిబద్ధత, సేవా తపన, ఉద్యమ స్ఫూర్తి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కేటీఆర్ ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు.

# ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ హత్య కేసు

## ఆప్ మాజీనేత తాహిర్ హుస్సేన్‌కు జీవితఖైదు



న్యూఢిల్లీ,జూలై31 : ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ అంకిత్ శర్మ హత్య కేసులో ఆప్ మాజీ నేత తాహిర్ హుస్సేన్‌కు ఢిల్లీ కోర్టు యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. 2020 నాటి ఢిల్లీ అల్లర్లలో అంకిత్ శర్మ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసు అత్యంత అరుదైనదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అత్యంత క్రూరంగా ఈ హత్య జరిగిందని వ్యాఖ్యానించింది. హత్య తరువాత కూడా మృతుడిపై ద్వేషం తగ్గలేదని నేరం తీరు చూస్తుంటే అనిపిస్తోందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. మృత దేహాన్ని ఈడ్చుకుంట తీసుకెళ్లి నాలాలో పడేశారని కోర్టు పేర్కొంది. అయితే, మూకదాడిలో భాగంగా ఈ హత్య జరగడం, ఘటన సమయంలో ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ శిక్ష ఖరారు చేసినట్టు కోర్టు పేర్కొంది. నాటి అల్లర్లల్లో కొందరు అంకిత్ శర్మపై కత్తులు, రాడ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశారు. మరుసటి రోజు ఉదయం మృతదేహం లభించింది. శరీరంపై 54 కత్తి పోట్లు ఉన్నట్టు పోలీ సులు గుర్తించారు. ఈ దాడిలో తాహిర్ కూడా ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. కోర్టు తీర్పుపై తాహిర్ లాయర్ స్పందిస్తూ హైకోర్టులో అప్పీలు చేసుకుంటామని అన్నారు. తనకు న్యాయం కొంత ఆలస్యంగానైనా దక్కుతుందన్న నమ్మకం ఉందని తాహిర్ తెలిపాడు. ఢిల్లీ న్యాయశాఖ మంత్రి కపిల్ మిశ్రా కూడాఈ తీర్పుపై స్పందిస్తూ తాహిర్‌కు యావజ్జీవం ఖరారు కావడంతో న్యాయం దక్కే దిశగా తొలి అడుగు పడిందని అన్నారు. అంకిత్ హత్య జరిగిన తీరు చూస్తే నిందితులకే మరణ శిక్షే తగినదని అభిప్రాయపడ్డారు. తాహిర్‌కు హైకోర్టు లో మరణ శిక్ష పడుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.

# సర్ ప్రక్రియలో దుబ్బాక ముందంజ

## 91.21 శాతం డిజిటలైజేషన్ పూర్తి



సిద్దిపేట,జూలై31 : సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సాగుతున్న సర్ పక్రియలో అత్యధికంగా దుబ్బాక నియోజకవర్గంలో 91.21 శాతం డిజిటలైజేషన్ పూర్తయి అగ్రస్థానంలో నిలవగా, అత్యల్పంగా సిద్దిపేటలో 83.44 శాతం మాత్రమే నమోదు నమోదైంది. స్థానికంగా శాశ్వతంగా నివసిస్తున్న వారి వివరాల నమోదు వేగంగా పూర్తయినప్పటికీ, ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాలు, పట్టణాలకు వెళ్లిన వారి పత్రాలు తిరిగి రాకపోవడమే ఆలస్యానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గ్రామాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల స్పందన మందకొడిగా ఉంది. రెండేసి చోట్ల ఓట్లు ఉన్నవారు, వలస వెళ్లిన వారు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి తిరిగి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. బీఎల్‌వోలు నేరుగా ఇళ్లకు వెళ్తున్నా ఓటర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలుస్తోంది. చివరి రోజుల్లో ఒకేసారి పెద్ద మొత్తంలో పత్రాలు వస్తే సర్వర్ ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశముందని, ఆగస్టు 1 లేదా 2 నాటికే పత్రాలను అందించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం రంగంలోకి దిగి అర్హులైన ఓటర్ల నుంచి పత్రాలు సేకరించి బీఎల్‌వోలకు అందజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓటర్ల ప్రాథమిక హక్కును తేల్చే సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఇప్పుడు చివరి ఘట్టానికి చేరింది. మరో నాలుగు రోజుల్లో గడువు ముగియనుండగా, జిల్లాలో ఇంకా 1.15 లక్షల మంది ఓటర్ల భవితవ్యం ఆన్‌లైన్ కాకుండా కాగితాలకే పరిమితమై ఉంది. ఇప్పటి వరకు 87.67 శాతం డిజిటలైజేషన్ పూర్తయిన ప్పటికీ... పట్టణ ఓటర్ల నిర్లక్ష్యం, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారి దోబూచులాట బీఎల్‌వోలను తీవ్ర ఒత్తిడిలోకి నెడుతోంది. చివరి నిమిషంలో సర్వర్లు మొరాయించే ప్రమాదం ఉన్నందున, ఇప్పుడే స్పందించకపోతే రేపటి జాబితాలో ఓటరుగా పేరు మాయమైనా ఆశ్చర్యం లేదు. జూన్ 25న ప్రారంభమైన సర్ పక్రియకు పెంచిన గడువు మరో నాలుగు రోజుల్లో, అంటే ఆగస్టు 3వ తేదీతో పూర్తికానుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,92,967 మంది ఓటర్లు ఉండగా, గురువారం నాటికి 8,70,509 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. దీంతో జిల్లాలో నమోదు పక్రియ 87.67 శాతానికి చేరింది.

# నర్సంపేట భారీగా తరలివచ్చిన జనం

- రెండు కిలోమేటర్లమేర ట్రాఫిక్ జామ్

వరంగల్,జూలై31 : తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సంపేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. పెద్ది దర్శన్ రెడ్డి పార్థివదేహాన్ని చూసిన పలువురు అభిమానులు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. 'మా నాయకుడు ఇక లేరు' అంటూ విలపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడికి తుది వీడ్కోలు పలికేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నర్సంపేటలో ఎటు చూసినా శోకసంద్ర వాతావరణమే కనిపించింది. అభిమానుల రోదనలు, నివాళులతో పట్టణం అంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజల ప్రేమాభిమానాలకు ప్రతీకగా వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ప్రియ నేతకు అశ్రునివాళులు అర్పించారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# (మొదటిపేజీ తరువాయి)

## బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది.అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.

## కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల పథకాలు, ప్రాజెక్టులు

చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

## ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్దిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. పేదలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు.

## వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ల్గ÷దరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌థ్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం పక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా పొందవచ్చన్నారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు.

## రెండేళ్ల పాలనలపై టిడిప ప్రచారం

### అభివృద్ధి, సంక్షేమాలపై ఇంటింటికి కరపత్రాల పంపిణీ

విజయవాడ,జూలై31 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా, పేదలకు గృహాల నిర్మాణం, మహిళా సంక్షేమ పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలతో కూడిన కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మాజీ గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య మాట్లాడుతూ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మార్గదర్శకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనకు భిన్నంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.గ్రామ టీడీపీ అధ్యక్షుడు మండల రాజేష్ మాట్లాడుతూ? ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని అన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయో జనాలు చేరేలా పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని చెప్పారు. గన్నవరం నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు చల్లగాలి సునీల్ మాట్లాడుతూ? ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు చేర్చడంతో పాటు పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకుడు చిలువూరి ప్రభాకర్, తెలుగు యువత గ్రామ అధ్యక్షుడు కొమ్ము ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సర్ ముసాయిదా ఓటరు జాబితా విడుదల

### 3.71 కోట్ల మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పణ

అమరావతి,జూలై31 : ఏపీలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ముసాయిదా ఓటరు జాబితా విడుదల అయింది. 3.71 కోట్ల మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారని సీఈవో వివేక్ యాదవ్ తెలిపారు. ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం.. మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో 89.22 శాతం మంది ఫారాలు ఇచ్చారు. 15.22 లక్షల మందిని మృతులుగా గుర్తించారు. 22.30 లక్షల మంది శాశ్వతంగా మారినట్లు లేదా గైర్హాజరైనట్లు నిర్ధరించారు. 7.37 లక్షల మంది పేర్లు రెండు, మూడు చోట్ల నమోదైనట్లు తేల్చారు. ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటు ఉన్నవారి పేరు ఒకే చోట కొనసాగించారు. నిజమైన ఓటర్లు ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకునే అవకాశముంది. జులై 31 నుంచి ఆగస్ట్ 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజక వర్గాల ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరునూ తొలగించబోమని అధికారులు తెలిపారు. అర్హులైన ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకూడదనే నిర్ణయానికి ఈసీ కట్టుబడి ఉందని సీఈవో తెలిపారు. అనర్హులు చేరకుండా పారదర్శక పక్రియకు కట్టుబడి ఉన్నామన్నారు.

## 21మంది వైకాపా నేతలపై కేసు

శ్రీకాకుళం,జూలై31 : మహిళా ఎస్సైతో అనుచితంగా ప్రవర్తించిన వైకాపా నేతలపై ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేశారు. వైకాపా అధ్యక్షుడు జగన్ శ్రీకాకుళం పర్యటనలో బూర్జ ఎస్సై ప్రవల్లికపై ఆమదాలవలస వైకాపా ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్, ఆయన అనుచరులు అనుచితంగా ప్రవర్తించి దౌర్జన్యం చేశారు. ఈ ఘటనలో మొత్తం 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చింతాడ రవికుమార్‌ను ఏ1గా పేర్కొన్నారు.

## కాశ్మీర్ సిఎం ఒమర్, పాయల్ దంపతులకు విడాకులు

- పరస్పర అవగాహనతో విడాకులకు సుప్రీం అంగీకారం



న్యూఢిల్లీ,జూలై31 : జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆయన భార్య పాయల్ అబ్దుల్లా దాంపత్య బంధానికి అధికారికంగా ముగింపు పలికింది. దాదాపు 17 ఏళ్లుగా విడిగా జీవిస్తున్న ఈ దంపతులు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకోగా, వారి అభ్యర్థనకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. అలాగే ఒకరిపై ఒకరు దాఖలు చేసుకున్న అన్ని న్యాయపరమైన కేసులను ఉపసంహరించుకోవడానికి కూడా ఇరు పక్షాలు అంగీకరించాయి. ఈ కేసును జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరధే ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా ఇరు పక్షాల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఒమర్ అబ్దుల్లా ? పాయల్ తమ మధ్య ఉన్న అన్ని విభేదాలను పరిష్కరించు కున్నారని కోర్టుకు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద పరస్పర అంగీకారంతో వివాహ బంధాన్ని రద్దు చేయాలని కోరుతూ జూలై 22న సంయుక్త పిటిషన్ దాఖలు చేసినట్లు వివరించారు. ఒప్పందంలోని నిబంధనల ప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. ఒమర్ అబ్దుల్లా, పాయల్ 1994లో వివాహం చేసుకున్నారు. ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో పనిచేస్తున్న సమయంలో ఇద్దరికీ పరిచయం ఏర్పడి, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరికి జహీర్, జమీర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే 2009 నుంచే ఇద్దరూ విడిగా నివసించడం ప్రారంభించగా, 2011లో తమ దాంపత్య జీవితం ముగిసిందని ఒమర్ అబ్దుల్లా బహిరంగంగా ప్రకటించారు. విడాకుల కోసం ఒమర్ అబ్దుల్లా ముందుగా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించినప్పటికీ, 2016లో ఆ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అనంతరం ఆయన ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ చేశారు. 2023 డిసెంబర్‌లో హైకోర్టు కూడా ఫ్యామిలీ కోర్టు తీర్పును సమర్థిస్తూ, పాయల్‌కు నెలకు రూ.1.5 లక్షల భరణం, కుమారుడి విద్య కోసం అదనంగా నెలకు రూ.60 వేల చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వును సుప్రీంకోర్టులో సవాలు చేసిన ఒమర్ అబ్దుల్లా కేసు మధ్యవర్తిత్వానికి వెళ్లింది. అక్కడ ఇరు పక్షాలు పరస్పర అవగాహనకు వచ్చి, అన్ని వివాదాలకు ముగింపు పలకడంతో సుప్రీంకోర్టు వారి విడాకులకు అధికారికంగా ఆమోదం తెలిపింది.

## గోదావరి వరద ఉధృతి

- ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశం
- గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి
- ఖమ్మం కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి ఆదేశాలు



హైదరాబాద్,జూలై31 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి శుక్రవారం సాయింత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో టెలిఫోన్‌లో మాట్లాడి, గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. లాశయాలకు భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రాజెక్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, దిగువ ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చినందున మూడవ ప్రమాదహెచ్చరిక జారీ చేశామని, ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుందని ఈ సందర్భంగా కలెక్టర్ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చారు. 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు.

## పెద్ది అంతిమయాత్రకు భారీగా జనం





- అంతిమయాత్రలో కన్నీరు పెట్టుకున్న హరీష్
- సత్యవతి రాథోడ్ రాక

వరంగల్,జూలై31 : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో మాజీ మంత్రి హరీశ్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన ఆప్త మిత్రుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సంపేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివ దేహం వరంగల్ జిల్లాలోని నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. ఇకపోతే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేవరకు చెప్పులు వేసుకోనని దీక్ష పట్టిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్న మీద నిలబడింది. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో సత్యవతి రాథోడ్ పాల్గొని కిలోమీటర్ల దూరం చెప్పులు లేకుండానే నడిచింది. కేసీఆర్ మరోసారి సీఎం అయ్యేంత వరకు చెప్పులు వేసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. మరో వైపు అంత్యక్రియల్లో పాల్గొనడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లికి చేరుకున్నారు.

## 19 యూనివర్సిటీ పాలకమండళ్లు రద్దు

### నామినేటెడ్ సభ్యులను తొలగిస్తూ ఉత్తర్వులు

అమరావతి,జులై31 : ఏపీలోని యూనివర్సిటీల పాలనలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 19 విశ్వవిద్యాలయాల పాలక మండళ్లను రద్దు చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో నియమించిన నామినేటెడ్ సభ్యులను తొలగించింది. ఈ మేరకు ఆయా విశ్వవిద్యాలయాల గవర్నింగ్ బాడీల రద్దుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. క్లాజ్-2 కింద నియమితులైన పాలక మండలి సభ్యులపై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే పదవీ రీత్యా కొనసాగుతున్న సభ్యులకు ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. క్లాజ్-1 కింద ఉన్న ఎక్స్-అఫిషియో సభ్యులు యథావిధిగా కొనసాగుతారని ప్రభుత్వం పేర్కొంది. విశ్వవిద్యాలయాల పాలక మండళ్ల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ)కు కొత్త పాలక మండలిని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాల్లో కూడా కొత్త పాలక మండళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

## బిఆర్ఎస్ కావాలనే జన్ జి రాజకీయం

### మండిపడ్డ కాంగ్రెస్ నేత సామా రామ్మోహన్

హైదరాబాద్, జూలై 31: తెలంగాణలో విద్యా శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. అయితే ఈ శాఖను జెన్ జీకి అప్పగించాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ అగ్రనేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు నేతలపై కాంగ్రెస్ పార్టీ నేత సామ రామ్మోహన్ రెడ్డి మండిపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ ఖాతా వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావులకు ఆయన బహిరంగ సవాల్ విసిరారు.జెన్ జీపై వీరికి నిజంగానే ప్రేముంటే.. ఢిల్లీ వెళ్లి జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టాలని సూచించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీమానాలను డిమాండ్ చేస్తూ ఈ దీక్ష చేపట్టాలని వారికి స్పష్టం చేశారు. వారిద్దరు.. తమ పదవులకు రాజీనామా చేసే వరకు వీరు దీక్ష విరమించకూడదని అన్నారు. ఓ వేళ వీరు ఆ విధంగా దీక్ష మధ్యలోనే విరమిస్తే.. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని భావించాల్సి ఉంటుందన్నారు. అలా జెన్ జీ ముందు ఒప్పుకోవాలంటూ వారికి సూచించారు. కేవలం రాజకీయం కోసం బీఆర్ఎస్ నేతలు ఇలాంటి నాటకాలకు తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ ఏ విధంగా సమస్యలతో సతమతమైందో ఈ సందర్భంగా సామ రామ్మోహన్ రెడ్డి వివరించారు. అదీకాక బీఆర్ఎస్ పాలనలో యువతను నిర్లక్ష్యం చేసి.. ఇప్పుడు విపక్షంలోకి రాగానే జెన్ జీ అంటూ కొత్త నాటకాలకు తెర తీశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

## 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

హైదరాబాద్,జూలై31 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. ఎల్ఆర్ఎస్ ఫీజులు, ఛార్జీలపై 25శాతం రాయితీ కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 1వ తేదీ నుంచి నవంబర్ 30, 2026 వరకు రాయితీ వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. 25శాతం రిబేట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ జీఓ ఎంఎస్ నంబర్ -.213 జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఆర్ఎస్ బకాయిల చెల్లింపునకు మరో నాలుగు నెలల గడువును పొడిగిస్తున్నట్లు స్పష్టం చేసింది. సంబంధిత శాఖలు తక్షణమే అమలు చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది.

## ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్

- దేశ జీడీపీలో తెలంగాణ వాటాను పదిశాతం పెంచడమే లక్ష్యం
- పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రదేశం
- సిఐఐ ప్రతినిధుల భేటీలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూలై31 : హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. టోక్యో, న్యూయార్క్‌తో పోటీ పడే తెలంగాణ తమ లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సీఐఐ నార్తర్న్ రీజినల్ కౌన్సిల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. పెట్టుబడులకు అత్యంత సురక్షిత రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి అని పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణ రైజింగ్ చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని వ్యాఖ్యానించారు.దేశ జీడీపీలో తెలంగాణ వాటాను పదిశాతానికి పెంచడమే తమ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. 2037 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మారుస్తామని చెప్పుకొచ్చారు. పాలసీ పెరాలసిస్ తెలంగాణలో లేదని అభిప్రాయపడ్డారు. మంచి విధానాలు ఏ పార్టీవైనా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్యూర్,ప్యూర్, రేర్ మోడల్‌తో తెలంగాణను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డును పారిశ్రామికంగా విస్తరణ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీ మచిలీపట్నం 12 లేన్ల రహదారిగా విస్తరిస్తున్నట్లు వివరించారు. తయారీ, సేవలు, వ్యవసాయ రంగాల్లో భారీ పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణకు మూడు బులలెట్ రైళ్లు రానున్నాయని సీఎం వివరించారు. ఏఐ సునామీకి తగ్గట్లుగా స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఉద్యోగ నైపుణ్యాలను పెంచుతున్నామని చెప్పుకొచ్చారు. ఏటీసీల్లో చదివిన వారికి వందశాతం ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అమెజాన్, అదానీ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు వివరించారు.

# మీ కుతంత్రాలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

## భోగాపురం విమనాశ్రాయం ప్రారంభానికి సిద్ధం

## జగన్‌కు ఎంపి పల్లా శ్రీనివాసరావు హెచ్చరిక



విశాఖపట్నం,జులై 31 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మరోసారి విరుచుకుపడ్డారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రాకు మణిహారమని గుర్తు పెట్టుకో జగన్ అని అన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. కేవలం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ఆటంకం కలిగించేందుకే విశాఖకు జగన్ వచ్చారని ఆరోపించారు. కుతంత్రాలతో అభివృద్ధిని ఆపలేరని పల్లా అన్నారు. రానున్న కాలంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు. గాజువాక నుంచి125, జిల్లా మొత్తం 5000 వేల బస్సుల్లో 5 లక్షల మంది ప్రజలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రత్యేకంగా దర్శించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును నిర్మించడం వల్ల అంతర్జాతీయంగా వ్యాపారస్థులు ఉత్తరాంధ్రకు రావడం అలాగే పరిశ్రమలు స్థాపించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రావడం వల్ల ఎన్నో పరిశ్రమలు వచ్చాయని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్ర.. స్వర్ణాంధ్ర బాటలో వెళ్లి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. ఇకపై ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఆగుతాయని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# భారీ వర్షాలతో ముందస్తు జాగ్రత్తలు

- గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడి



కోనసీమ,జూలై31 : గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాత్రికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. సుమారు 10 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే, రేపు సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. సుమారు 13 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల ఉండొచ్చని అంచనా వేశారు. జిల్లాలోని 19 మండలాలపై వరద ప్రభావం ఉందని కలెక్టర్ వెల్లడించారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని 16 - 17 మండలాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 32 లంక గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నాయని, వరద ప్రభావం నేపథ్యంలో జిల్లా అధికారుల సెలవులను మూడు, నాలుగు రోజుల పాటు రద్దు చేసినట్లు తెలిపారు. నీటిమట్టం అంతకంతకూ పెరుగుతున్నందున గోదావరిలోకి ఎవరూ దిగవద్దని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పడవ ప్రయాణాలపై తాత్కాలిక ఆంక్షలు విధించామని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు.

## మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీజీ

### ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు



అమరావతి,జులై 31 : ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానా శ్రయాన్ని ఆగస్టు 1న శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురు చూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్ పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

# జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్ట్ విధ్వంసం

- పోలవరాన్ని ప్రతిష్టగా తీసుకుని పూర్తి చేస్తున్న చంద్రబాబు
- జగన్ అధికారంలోకి రాకుండావుండివుంటే పరిస్థితి మరోలా ఉండేది
- చనిపోయిన వ్యక్తిని కాదని... చంపిన వ్యక్తిని పరామర్శించడమా
- మందీమార్బలాన్ని వేసుకుని బలప్రదర్శనకు వెళ్లడమేంటి
- సీనియర్ నేత బొత్స అయినా జగన్‌కు సూచనలు చేయాలి
- మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు



కాకినాడ,జూలై31 : జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యమైందని, దానిని పూర్తి చేసే క్రమంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా సాగుతోందని ఏపీ జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జగన్‌కున్న క్రెడిట్ చోరీ జబ్బును అందరికీ అంటించాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలవరం నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరంకు ఎగువన నీటి నిల్వ కోసం, ఒక్క ప్రాజెక్టు కూడా లేకపోవడం చూసి సర్ ఆర్థర్ కాటన్ మనవరాలు ఆవేదన చెందారని చెప్పారు. నాడు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని వివరించారు. 2019లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్లి ఉండేవని అన్నారు. క్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసి, డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేశారని మండిపడ్డారు. నాడు ఇరిగేషన్ మంత్రులు, సీఎం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటూ అసెంబ్లీలోనే చెప్పి, ఆ ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మొదటి పర్యటన పోలవరంకు వచ్చి 2027 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా లక్ష్యంగా పెట్టారని వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసం అయిన డయా ఫ్రం వాల్‌ను పూర్తి చేసి.. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను వేగవంతం చేశామని అన్నారు. పోలవరం పూర్తయ్యేలోగా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా నాడు చంద్రబాబు పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీరందిస్తున్నామని వివరించారు. 5 ఏళ్ళ గొడ్డలి పార్టీ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో తట్ట మట్టిగానీ, రూపాయి పని గానీ చేయలేదని వైసీపీని విమర్శించారు. తమ పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల వైపు కన్నెత్తి చూడని గొడ్డలి పార్టీకి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. జగన్ ఇరిగేషన్ శాఖలో రూ.18 వేల కోట్ల బకాయిలు వారసత్వంగా ఇచ్చి వెళ్లారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని రూ.1,800 కోట్లు ఖర్చు పెట్టి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తున్నామని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పోలవరం ఎడమ కాలువలో ఉన్న క్లిష్టతరమైన పనులను రెండేళ్ళలోనే పూర్తి చేశామని ప్రకటించారు. ఆగస్టులోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనుల జాప్యం నేపథ్యంలో ఏజెన్సీలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే చర్యలు తప్పవని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందితే జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. సీదిరి అప్పలరాజు కుమారుడిని కాపాడుకుందామని అనేక తప్పులు చేశారు. నిందితుడిని కాపాడుతూ జగన్ ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఎందుకు మౌనంగా ఉన్నారు? ఆయన అయినా జగన్‌కి హితవు చెప్పాలి. అప్పలరాజుకు పరామర్శ పేరుతో బలప్రదర్శన నిర్వహించారు. మహిళా ఎస్సైపై వైకాపా నేతల దాడి హేయమైన చర్య. జైలు వద్ద జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. దానయ్య కుటుంబానికి ఆయన క్షమాపణ చెప్పాలి. భోగాపురం విమానాశ్రయాన్ని జగన్ వ్యతిరేకించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదు. మోదీ-చంద్రబాబు సారథ్యంలో ఎయిర్‌పోర్టు సిద్ధమైందని నిమ్మల రామానాయుడు అన్నారు.ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెల్లిందని మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లాలోని అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇది పరామర్శ యాత్రగా కాకుండా, బలప్రదర్శన యాత్రగా మాజీ సీఎం జగన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ పండగ వాతావరణంలో ఉంటే.. వైఎస్ జగన్ ఓర్వలేనితనంతో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు. దారిన పోయే దానయ్య చనిపోతే నష్టమేంటని వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని చెప్పారు. దానయ్యకు 45 ఏళ్ళు వచ్చాయి.. వయసైపోయిన వ్యక్తి చనిపోతే నష్టమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారని అన్నారు. మరి 54 ఏళ్ళు వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు కూడా వయసై పోయినట్లే కదా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఖాకీ డ్రెస్ అన్నా.. మహిళలన్నా గొడ్డలి పార్టీ నాయకుడికి గౌరవం లేదని విమర్శించారు. ఆడవాళ్ళ జోలికొస్తే అదే ఆఖరి రోజు అని సీఎం చంద్రబాబ వ్యాఖ్యలు.. గొడ్డలి పార్టీకి కూడా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. చనిపోయిన వ్యక్తిని కాదని, చంపిన వ్యక్తిని పరామర్శించడం సరికాదని.. మాజీ మంత్రి బొత్స లాంటి వారు కూడా జగన్‌కు ఎందుకు చెప్పలేకపోయారంటూ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పాటిస్తామని ప్రమాణం చేసిన వ్యక్తి.. హత్య చేసిన వ్యక్తిని ఓదార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఎర్ర బస్సు రాని ఊరికి, ఎయిర్ బస్ ఎందుకని నాడు జగన్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కోర్టులకు వెళ్లి మరీ భోగాపురం ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకుంటానని జగన్ చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

# సెప్టెంబర్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

## భారత్ ఆతిథ్యంలో సమావేశాలు

## హాజరుకానున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

న్యూఢిల్లీ,జూలై31 : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నారు. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్ పర్యటనకు రాబోతున్నారు. సెప్టెంబర్‌లో భారత్‌లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి రావాల్సిందిగా జిన్‌పింగ్‌కు భారత్ ఆహ్వానం పంపింది. అయితే భారత్ పర్యటనకు జిన్‌పింగ్ సిద్ధంగా ఉన్నట్లుగా వార్తలు వెలువడుతున్నాయి. గల్వాన్ ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కనిష్ట స్థాయికి చేరుకున్న నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. బ్రిక్స్ కూటమికి ఈ ఏడాది భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలకు చైనా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో.. జిన్‌పింగ్ ఢిల్లీలో జరిగే శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని ఈ పరిణామాలపై అవగాహన ఉన్న వర్గాలు తెలిపినట్లు సమాచారం. అయితే జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటివరకు చైనా లేదా భారత్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాలని చైనా అధ్యక్షుడికి భారత్ ఇప్పటికే అధికారిక ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ ఒక ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. బ్రిక్స్ సహకారానికి చైనా అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ కూటమి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుందని తెలిపారు. ఈ ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్.. శిఖరాగ్ర సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సమావేశానికి జిన్‌పింగ్ హాజరుపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. జిన్‌పింగ్ భారత్‌కు వస్తే.. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఆయన చేపట్టే తొలి భారత పర్యటనగా ఇది నిలవనుంది. చివరిసారిగా జిన్‌పింగ్ 2019 అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో తమిళనాడులోని మామల్లపురంలో ప్రధాని మోడీతో రెండో అనధికారిక శిఖరాగ్ర సమావేశం నిర్వహించారు. అనంతరం 2020లో గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవ డంతో భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరోవైపు ప్రధాని మోడీ 2025లో చైనాలో పర్యటించారు. టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ప్రధాని మోడీ చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి.బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా భారత్‌కు వచ్చే అవకాశం ఉందని క్రెమ్లిన్ ఇప్పటికే ధ్రువీకరించింది. బ్రిక్స్ సభ్యదేశమైన ఇరాన్ కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఇరాన్ నుంచి ఏ స్థాయి ప్రతినిధి బృందం హాజరవుతుందన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా.. బంగ్లాదేశ్ కూడా బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో అత్యున్నత స్థాయిలో పాల్గొనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావాలని బంగ్లాదేశ్ ప్రధానికి ప్రధాని మోడీ ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది. ఈ ఆహ్వానాన్ని ప్రస్తుతం సమీక్షిస్తున్నామని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రహ్మాన్ బుధవారం తెలిపారు.

# భోగాపురానికి ఎయిరిండియా షెడ్యూల్ ప్రకటన



అమరావతి,జులై 31 : ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్న భోగాపురం ఎయిర్‌పోర్టులో ఆగస్టు 17 నుంచి విమానాల రాకపోకలు మొదలవుతాయి. ఈ నేపథ్యంలో ఎయిరిండియా అక్టోబర్ 24 వరకు ఫ్లైట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. హైదరాబాద్-భోగాపురం మధ్య రోజుకు 5 సర్వీసులు, బెంగళూరు-భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులతో పాటు, ఆది, శుక్రవారాలు మినహా మిగిలిన 5 రోజులు మరో సర్వీసును నడుపుతామన్నారు. విజయవాడ-భోగాపురం మధ్య రోజుకు 4 సర్వీసులు నడపనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

# అంతర్జాతీయ విమానాశ్రయంతో మారనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

- ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్టు గేమ్ ఛేంజర్
- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి.




భోగాపురం, జులై 31 : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర భవిష్యత్తు, ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అల్లూరి సీతారామరాజు భోగాపురం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, ఉపా ధి, రవాణా, పర్యాటకం, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడే అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రజల రాకపోకలకు ఇప్పటికే వేల బస్సులను ఏర్పాటు చేశామని, ప్రజా ప్రతినిధులు కూడా తమ సొంత వాహనాలతో పాటు మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేతులమీదుగా రూ. 17,900 కోట్ల ప్రాజెక్టులకు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రధాన మంత్రి భోగాపురం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం, ఉత్తరాంధ్ర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు సమాచార,పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో భారీ ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. శ్రీకాకుళం,విజయనగరం, విశాఖపట్నం నగరాల్లో సుమారు 200 హోర్డింగ్స్, 50 ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా డ్రోన్ల ద్వారా కూడా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 5 డ్రోన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా డిజిటల్,సోషల్ మీడియా వేదికల ద్వారా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాధాన్యత, ఉత్తరాంధ్రకు రానున్న అభివృద్ధి అవకాశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని మంత్రి పార్థసారథి వివరించారు. విమానాశ్రయంతో ఎగుమతులకు కొత్త ఊపు లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భోగాపురంఎయిర్ పోర్టులో 25,000 మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యం కలిగిన టెర్మినల్ అందుబాటు లోకి రావడంతో ఉత్తరాంధ్ర నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, వాణిజ్య రంగాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు, దేశాలకు వలస వెళ్లే ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విమానాశ్రయం ద్వారా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ ఏర్పడి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు.పోలవరం నీటితో ఉత్తరాంధ్రకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఆగస్టు 14 న పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నుంచి ఉత్తరాంధ్రకు నీటిని తీసుకువచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగు నీరు, తాగు నీరు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. పాత్రికేయుల సమావేశం లో సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్. విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

**-ఎల్ నినో ప్రభావంపై అవగాహన కల్పించాలి..**
**-ఇందిరమ్మ ఇండ్లు వేగంగా పూర్తి చేయించాలి..**
**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**



బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,

ఎల్ నినో ప్రభావంపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, తెలంగాణ జలసిరి పనులు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సాగు విస్తీర్ణం, ప్రస్తుతం ఏ ఏ పంటలు వేశారో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ అన్ని మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితిపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన

కల్పించాలని సూచించారు. పప్పు ధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్, పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు, మొక్కలు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సంయుక్తంగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం రైతులకు అవగాహన సమావేశాలు మరిన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో తెలంగాణ జలసిరి కింద జి

ల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రెసిడెన్షియల్, ఇతర విద్యాలయాల్లో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి.. పనులు మొదలు పెట్టాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో అన్ని భవనాలు, ఇండ్లలో ఇంకుడు గుంతలు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన భవనాల అనుమతిలో ఇంకుడు గుంతలు ఉంటేనే పర్మిషన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు బోర్ వెల్స్ రీచార్జ్ పనులు ముమ్మరంగా చేయించాలని తెలిపారు. భూ గర్భ జలాల లభ్యత, భవిష్యత్తు అవసరాలపై రైతులకు వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు సంయుక్తంగా అవగాహన కల్పించి.. ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంట కుంటలు , ఊట కుంట పూర్తి చేయాలని ఆదేశించారు. వాన నీటిని సంరక్షిస్తే భవిష్యత్ లో ఎంతో మేలు చేకూరుతుందని, భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు.

**లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాలి**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితి, ప్రారంభమైన నిర్మాణాలు, పూర్తయిన ఇండ్ల వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. రెండో దశలో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక, అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను ఆరా తీశారు.ఇండ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ సామగ్రి అందుబాటులో పెట్టడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ. సహకారం అందించాలని సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణం వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి జయశీల అధికారులు ఉన్నారు.



## ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ప్రైవేట్ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం మరియు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ అన్నారు.శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని సృజన హాస్పిటల్‌ను జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ, ఐపీ విభాగాలు, ప్రసూతి వార్డు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ప్రయోగశాల, ఫార్మసీ, అత్యవసర వైద్య సేవలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగుల రికార్డుల నిర్వహణ, పారిశుధ్య పరిస్థితులు, ఇన్ఫెక్షన్ కంట్రోల్ చర్యలు, అవసరమైన మందులను పరిశీలించారు.

అనంతరం డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ, రోగులకు నాణ్యమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందించాలని, అవసరం లేని వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలు చేయకుండా వైద్య నైతిక విలువలను పాటించాలని ఆదేశించారు.సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణులు మరియు నవజాత శిశువులకు ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించాలని, ఆసుపత్రిలో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అన్ని చట్టబద్ధ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు

# సిరిసిల్లలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ప్రకటన..



బలగం టీవీ, సిరిసిల్ల:

భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా మోర్చా నూతన జిల్లా కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రకటించారు. బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ ఆధ్వర్యంలో, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి సమక్షంలో జిల్లా మహిళా మోర్చా నూతన జిల్లా కమిటీ సభ్యుల పేర్లను వెల్లడించారు.

జిల్లా ప్రధాన కార్యదర్శులుగా దాసరి పూర్ణిమ (ఎల్లారెడ్డిపేట), మంత్రి సంతోష (వేములవాడ అర్బన్), జిల్లా ఉపాధ్యక్షులుగా రెడ్డబోయిన మనోజ్ఞ, భీమనపల్లి శోభ (సిరిసిల్ల పట్టణం), తుమ్మల రాజవ్వ (వేములవాడ అర్బన్), జిల్లా కార్యదర్శులుగా ఎక్కలదేవి జమున (గంభీరావుపేట), గుంటుక మంజుల (సిరిసిల్ల పట్టణం), జొన్నకంటి తేజశ్రీ (ఎల్లారెడ్డిపేట), జిల్లా అధికార ప్రతినిధిగా సుధాగోని నిశ్చిత (కోనరావుపేట), జిల్లా 'మన్ కీ బాత్' కన్వీనర్‌గా గంగాధర మమత (చందుర్తి)లను నియమించినట్లు ప్రకటించారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహిళా మోర్చా కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మహిళలను పార్టీ కార్యక్రమాల్లో మరింత భాగస్వాములను చేస్తూ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

**- లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు,**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

చట్టాలపై అవగాహన ఉండటం వల్ల వ్యక్తులు తమ హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు విధులను సక్రమంగా నిర్వర్తించగలరని లోక్ అదాలత్ సభ్యులు,న్యాయవాది ఆడెపు వేణు అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల, మండేపల్లి మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/ కార్యదర్శి,డిఎల్ ఎస్ ఏ పి.లక్ష్మణాచారి సమన్వయంతో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ ప్రతి పౌరుడు దేశ చట్టాలను తెలుసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే సమాజంలో శాంతి, సామరస్యం, న్యాయం నెలకొల్పడంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా అర్హులైన పేదలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని అన్నారు . న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యాలయాన్ని సంప్రదించి ఉచిత న్యాయ సేవలను పొందవచ్చని తెలిపారు.అవగాహన సదస్సులో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్. మల్లేశ్ యాదవ్, న్యాయవాదులు గుర్రం ఆంజనేయులు, బూర మధుసూదన్, గురుకులాల ప్రధానోపాధ్యాయులు విష్ణు, సుజాత మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్ పరిచయంతో మహిళలకు వేధింపులు.. ఎస్సై అరెస్ట్

**లైంగిక వేధింపులు, బెదిరింపుల కేసులో 14 రోజుల రిమాండ్**

బలగం టీవీ, వరంగల్

మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారే దారి తప్పి లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఫేస్‌బుక్ ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని వారిని వేధించిన సబ్ ఇన్‌స్పెక్టర్ కదిరే శ్రీకాంత్ (38)ను సుబేదారి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలానికి చెందిన శ్రీకాంత్ 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్సై. వివాహితుడైన అతడు 2025లో ఫేస్‌బుక్ ద్వారా ఓ మహిళతో పరిచయం పెంచుకుని సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నాడు. అనంతరం ఆమె వ్యక్తిగత పరిస్థితులను ఆసరాగా చేసుకుని వరంగల్‌లోని ఆమె నివాసానికి వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉన్నాయి.

అంతేకాకుండా బాధితురాలి వ్యక్తిగత ఫొటోలు తన వద్ద ఉన్నాయని, విషయం బయటకు చెబితే చంపేస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వేధింపులు భరించలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎస్సై శ్రీకాంత్‌ను అరెస్టు చేశారు.

దర్యాప్తులో భాగంగా ఇదివరకు హైదరాబాద్‌కు చెందిన మరో యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా లోబర్చుకున్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదై ఉన్న విషయం కూడా వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.




## ఆగస్టు 2 నుండి 'గీతన్నల చైతన్య బస్సు యాత్ర'

బలగం టీవీ, హైదరాబాద్

కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర'ను నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ వెల్లడించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, ఎం. కృష్ణ స్వామి గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్ గౌడ్‌లతో కలిసి ఆయన యాత్ర రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా మేకపోతుల రమణ మాట్లాడుతూ.. ఆగస్టు 2న మహబూబాబాద్‌లో ప్రారంభమయ్యే ఈ బస్సు యాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ, ఆగస్టు 18వ తేదీన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ముగుస్తుందని తెలిపారు.

అధికారంలోకి వచ్చి 30 నెలలైనా హామీలు శూన్యం: ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికుల పెన్షన్ రూ. 4 వేలకు పెంచుతామని, ప్రమాద వశాత్తు మరణిస్తే నెల రోజుల్లోనే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని రమణ గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఈ హామీలు అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. వృత్తిలో ప్రమాదాలు జరిగిన బాధితులకు ఇవ్వాల్సిన రూ. 20 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలనే జీవో ఉన్నా, కొత్త దరఖాస్తులను స్వీకరించడం లేదని ధ్వజమెత్తారు. తాము కొత్త కోరికలు కోరడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు.

బడ్జెట్ నిధులు విడుదల చేయాలి: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వృత్తిలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఇచ్చే 'కాటమయ్య రక్షణ కవచం' రాష్ట్రంలో సభ్యత్వం ఉన్న 2.30 లక్షల మందికి గానూ, కేవలం 30 వేల మందికే ఇచ్చారని, మిగిలిన వారందరికీ వెంటనే పంపిణీ చేయాలని కోరారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. నందనవనంలోని నీరా ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, బడ్జెట్‌లో నీరాకు కేటాయించిన రూ. 25 కోట్లు, సంక్షేమానికి కేటాయించిన రూ. 65 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ చైతన్య యాత్రను తలపెట్టినట్లు వారు స్పష్టం చేశారు.

## వర్షాలకు ఇళ్లు కూలి నిరాశ్రయులైన కుటుంబాలు

**చామనపల్లిలో ఎనిమిది ఇళ్లకు నష్టం..**

**బాధితులకు తాత్కాలిక పునరావాసం**

బలగం టీవీ, పెద్దపల్లి

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామంలో ఎనిమిది ఇళ్లు దెబ్బతిన్నాయి. వీటిలో రెండు ఇళ్లు పూర్తిగా కూలిపోగా, మిగిలిన ఇళ్ల గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో బాధిత కుటుంబాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా పునరావాసం కల్పించి అవసరమైన వసతులు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇళ్లు కూలిన విషయాన్ని సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులను గ్రామాన్ని సందర్శించి నష్టం వివరాలు సేకరించాలని ఆదేశించారు.దీంతో ఎంపీడీవో వి. సుమలత శుక్రవారం గ్రామాన్ని సందర్శించి, సర్పంచ్ రేవతి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌తో కలిసి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధితుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఇళ్లను కోల్పోయిన కుటుంబాలకు తగిన పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఎంపీడీవో సుమలత తెలిపారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-2 శివ కోటేష్ గ్రామాన్ని సందర్శించి, జీపీఓ ఎల్లయ్యతో కలిసి బాధిత కుటుంబాల వివరాలను నమోదు చేశారు.



## పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ఎల్లారెడ్డిపేట్‌లో బీఆర్ఎస్ నేతల నివాళి..

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జెడ్పీటీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా తిమ్మాపూర్ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందే సుభాష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన ప్రజానాయకుడిని కోల్పోవడం పార్టీకి, తెలంగాణ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. ఈ నివాళి కార్యక్రమంలో అల్మాస్పూర్ ఉప సర్పంచ్ కొర్రి అనిల్, ధర్మ గౌడ్, మాజీ సర్పంచ్ మాలో పుణ్య నాయక్, మునిగే ప్రమోద్, ఘనగోనిబంటి, కొర్రి ఆశీర్వాదం, ముత్యాల బాలరాజ్, గణపతి, పీరియా గోపాల్ తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బూర్ల ప్రతాప్‌కు ఘన నివాళి..

**- కుటుంబ సభ్యులను పరామర్శించిన సిరిసిల్ల బీఆర్ఎస్ నాయకులు..**

బలగం టీవీ, సిరిసిల్ల:

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు బూర్ల ప్రతాప్ జూలై 30, 2026 (గురువారం)న పరమపదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం వారి నివాసానికి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి కీర్తిశేషులు బూర్ల ప్రతాప్ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జిందం చక్రపాణి మాట్లాడుతూ, బూర్ల ప్రతాప్ గారు బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు విశేష కృషి చేశారని కొనియాడారు. పార్టీ పట్ల వారి అంకితభావం, సేవా తపన చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి మరణంతో పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని, వారు లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రిక్కమల్లె సంపత్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, సీనియర్ నాయకులు గుండ్లపల్లి శ్రీనివాస్, దిడ్డి రాజు, కొండ శంకర్, బీజేపీ నాయకులు ఉరవకొండ రాజు, మెరుగు శ్రీనివాస్ తదితర ప్రముఖులు పాల్గొని కీర్తిశేషులు బూర్ల ప్రతాప్ కి ఘన నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# సిరిసిల్లలో 'సీఐటీయూ` జాతీయ సభలు

**అఖిల భారత టెక్స్‌టైల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు**

**విజయవంతం చేయాలని చెరుపల్లి పిలుపు**



బలగం టీవీ, సిరిసిల్ల:

సిరిసిల్ల పట్టణంలో ఆగస్టు 23న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఐటీయూ (CITU) అఖిల భారత టెక్స్‌టైల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలను, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. సిరిసిల్లలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా జాతీయ సభలు: తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ తరహా జాతీయ స్థాయి సమావేశాలు జరుగుతున్నాయని చెరుపల్లి సీతారాములు ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సీఐటీయూ జాతీయ, రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులతో పాటు టెక్స్టైల్–పవర్లూమ్ రంగాలకు చెందిన ప్రతినిధులు ఈ సభలకు భారీగా హాజరవుతారని తెలిపారు. ఈ ఉన్నత స్థాయి సమావేశాల్లో ప్రధానంగా వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు-అభివృద్ధి, పవర్లూమ్ కార్మికుల సంక్షేమ పథకాలు, భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి ఒక స్పష్టమైన కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భారీగా తరలిరావాలని విజ్ఞప్తి: సిరిసిల్ల నేతన్నల ఇలాకాలో జరుగుతున్న ఈ జాతీయ మహాసభలను, బహిరంగ సభను విజయవంతం చేయడానికి జిల్లాలోని పవర్లూమ్ కార్మికులు, పారిశ్రామిక యజమానులు, వస్త్ర వ్యాపారులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐటీయూ ప్రముఖ నాయకులు ముషం రమేష్, కూరపాటి రమేష్, కోడం రమణ, సిరిమల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# సమర్థ దర్యాప్తు వేగవంతమైన విచారణతో సత్ఫలితాలు సాధిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు..

**- గడిచిన ఆరు నెలల కాలంలో 44 కేసులలో 66 మంది నిందుతులకు జైలు శిక్షలు..**

**- 05 హత్య కేసులలో 19 మందికి యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్షలు..**

**- నిందితులకు శిక్ష పడటంలో విశేష కృషి చేస్తున్న అధికారులకు,సిబ్బందికి ప్రసంశలు, ప్రోత్సాహకాలు..**

**- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్ఠమైన సాక్ష్యాధారాల సేకరణ, వేగవంతమైన విచారణతో నిందితులకు శిక్షలు పడేలా జిల్లా పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పలు కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన అధికారులకు, సిబ్బందిని అభినందించి ప్రశంస పత్రాలు,ప్రోత్సాహకాలు అందజేశారు.

గడిచిన ఏడు నెలల్లో కోర్టులు విధించిన శిక్షల వివరాలు.. 05 హత్య కేసుల్లో 19 మంది నిందితులకు యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్షలు, 03 కేసుల్లో నిందితులకు 20 సంవత్సరాల జైలు శిక్ష, 02 కేసుల్లో నిందితులకు10 సంవత్సరాల జైలు శిక్ష, 07 కేసుల్లో నిందితులకు 3 నుండి 5 సంవత్సరాల జైలు శిక్ష, 17 కేసుల్లో నిందితులకు1 నుండి 3 సంవత్సరాల జైలు శిక్ష, 10 కేసుల్లో నిందితులకు ఒక సంవత్సరం లోపు జైలు శిక్ష... మొత్తంగా గత ఆరు నెలల కాలంలో 44 కేసుల్లో 66 మంది నిందితులకు జైలు శిక్షలు విధించబడగా, అందులో 05 హత్య కేసుల్లో 19 మంది నిందితులకు జీవిత ఖైదు విధించడం విశేషమని ఎస్పీ తెలిపారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిందితులకు శిక్షలు పడటంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర అత్యంత కీలకమని, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు.గడచిన ఆరు నెలల కాలంలో పలు క్రిమినల్ కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించయని,ముఖ్యంగా హత్య, పొక్సో, హత్యాయత్నం, దోపిడీ, చోరీ తదితర కేసుల్లో పకడ్బందీగా త్వరగతిన దర్యాప్తు నిర్వహించి, సాక్ష్యాలను కోర్టులో సమర్పించడం వల్ల శిక్షల శాతం పెరిగాయని, ఇదే ఉత్సహంతో ప్రతిఒక్కరు పని చేయాలని సూచించారు.పోలీసు అధికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రతి కేసును బాధ్యతాయుతంగా విచారించాలని,ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం దర్యాప్తులో అత్యంత కీలకమైందని, ప్రతి కేసులో శాస్త్రీయ (Scientific) ఆధారాలను తప్పనిసరిగా సేకరించి కోర్టులో సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, కోర్టు మానిటరింగ్ ఎస్.ఐలు రవీంద్రనాయుడు, శ్రావణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు..

**- కల్వర్టును శుభ్రం చేయించిన సర్పంచ్ మోహన్**

బలగం టీవీ, బోయినిపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వేములవాడ వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు చెత్తాచెదారంతో పూర్తిగా మూసుకుపోయింది. దీంతో వర్షపు నీరు కల్వర్టు మీదుగా ప్రవహించి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నల్ల మోహన్ వెంటనే స్పందించి జేసీబీ సహాయంతో కల్వర్టులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. దీంతో నీటి ప్రవాహం సాఫీగా కొనసాగడంతో పాటు వాహనాల రాకపోకలు యథావిధిగా పునరుద్ధరించబడ్డాయి. వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకున్న సర్పంచ్ నల్ల మోహన్‌ను గ్రామస్థులు అభినందిస్తూ, ఆయన సేవాభావాన్ని కొనియాడారు.



# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు..



**- శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం..**

**- స్వీయారక్షణార్థం గ్రామాల్లో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.**

**- గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి.**

**- సరైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు గుర్తింపు.**

**- వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు.**

బలగం టీవీ, వేములవాడ:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు శుక్రవారం రోజు ఉదయం వేములవాడ డీఎస్పీ ఆధ్వర్యంలో కొనరవుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామం మరియు కమ్మరి పేట తండాలల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 39 ద్విచక్ర వాహనాలను గుర్తించి,సంబంధిత యజమానులు అవసరమైన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు.నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు అనుమానిత వ్యక్తులను (సస్పెక్ట్స్) తనిఖీ చేసి, వారి ప్రస్తుత కదలికలు, స్థితిగతులపై ఆరా తీశారు. ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం (Sense of Security) కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.

అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో మరియు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కాలనీ లలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.

గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సర్కిల్ సి.ఐ రవీందర్, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి, రమేష్, మోతిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.



# సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో సేవలందించడం అభినందనీయం..



**- ఉద్యోగ విరమణ పొందుతున్న అదనపు ఎస్పీ(అడ్మిన్) చంద్రయ్య కి ఘన సన్మానం..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చంద్రయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు,సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై అదనపు ఎస్పీ చంద్రయ్య ని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో అదనపు ఎస్పీ చంద్రయ్య ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో సేవలందించారని కొనియాడారు. తన విధి నిర్వహణలో సమర్థత, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి, సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని ఎస్పీ అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా సహచర అధికారులు, పోలీస్ సిబ్బంది చంద్రయ్య గారితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన సేవలను ప్రశంసించారు.అనంతరం పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

**అదనపు ఎస్పీ చంద్రయ్య పోలీస్ శాఖ ప్రస్థానం..**

అదనపు ఎస్పీ చంద్రయ్య 1991 సంవత్సరంలో ఎస్.ఐ గా పోలీస్ శాఖలో చేరి శిక్షణ అనంతరం ఎస్.ఐ తొలిసారిగా కొత్తగూడ పోలీస్ స్టేషన్ వరంగల్ లో భాధ్యతలు చేపట్టి, వరంగల్ లో పలు పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వహించారు.

అనంతరం 2007 సంవత్సరంలో ఇన్స్పెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించి ఇన్స్పెక్టర్ గా వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పని చేశారు.

2017 సంవత్సరం లో డిఎస్పీ గా పదవి బాధ్యతలు స్వీకరించి రామగుండం కమిషనరేట్ లో క్రైమ్ ఏ.సి.పి గా హన్మకొండ, సైబరాబాద్ లలో ఏసీపీ క్యాడర్ లో ముఖ్య బ్యాధ్యతలు అందించారు.

అనంతరం కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో పనిచేసే సమయంలో 2021 సంవత్సరంలో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించి నాలుగున్నర సంవత్సరాలుగా జిల్లాలో విశిష్ట సేవలు అందించి నేడు గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందారు.

రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను సేవ పథకం, ఉత్తమ సేవ పథకాలతో అందించడం జరిగింది.35 సంవత్సరాల సుదీర్ఘ సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్ తో సత్కరించింది. ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు, సి.ఐ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, ఏ. ఓ, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది



## భారీ వర్షాలకు కూలిన పురాతన వేపచెట్టు.. స్పందించిన బిఆర్ఎస్ నేతలు..

**- అధికారుల సత్వర స్పందనతో సమస్య పరిష్కారం**

బలగం టీవీ, సిరిసిల్ల:

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో సిరిసిల్ల పట్టణంలోని పెద్ద బజారులో ఉన్న అతి పురాతనమైన వేపచెట్టు గురువారం ఒక్కసారిగా ఓ కారుపై కూలిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్పందించి బాధితుడిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటన విషయం తెలుసుకున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి గారు, స్థానిక వార్డు కౌన్సిలర్ ఆడిచర్ల రూప సాయి గారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

అనంతరం మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది, అలాగే సహకార విద్యుత్ సంస్థ (CESS) అధికారులతో సమన్వయం చేసి చెట్టును తొలగించే చర్యలు చేపట్టించారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ, ట్రాఫిక్‌ను పునరుద్ధరించి సమస్యను దగ్గరుండి పరిష్కరించారు. స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు.



## బుడగ జంగాల కాలనీలో 30 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు..

**లోతట్టు ప్రాంత ప్రజలకు హరిమల గార్డెన్‌లో పునరావాసం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**బుడగ జంగాల కాలనీని పరిశీలించిన చైర్మన్, ఆర్డీఓ,డీఎస్పీ, కమిషనర్**

**ఆపద వస్తే వెంటనే సమాచారం ఇవ్వండి: చైర్మన్ పుల్కం రాజు**

బలగం టీవీ, వేములవాడ:

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వేములవాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. ముఖ్యంగా 13వ వార్డు పరిధిలోని కొనాయిపల్లి రోడ్డులో ఉన్న బుడగ జంగాల కాలనీని వర్ద నీరు చుట్టుముట్టడంతో కాలనీ పూర్తిగా జలమయమైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులను కాపాడేందుకు మున్సిపల్ యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగింది.

వరద ముప్పు పెరిగే ప్రమాదం ఉండటంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా దాదాపు 30 కుటుంబాలను మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. తాత్కాలిక పునరావాస కేంద్రమైన హరిమల గార్డెన్‌కు తరలించి ప్రాథమిక వసతులను కల్పించారు. అయితే పరిస్థితిని తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆర్డీఓ ఎస్.కె.బి. కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌లతో కలిసి జలమయమైన 13వ వార్డు కాలనీ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హరిమల గార్డెన్‌లోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు కల్పిస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. వర్షాల ఉద్ధృతి దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకే కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పుల్కం రాజు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ప్రతికూల వాతావరణంలో అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ధైర్యాన్నిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం ఎదురైతే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, తహసిల్దార్ జయంత్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, టిబిపిఓ వినోద్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుకుమార్, మున్సిపల్, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తీరని లోటు

**- మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్**

బలగం టీవీ, చిగురుమామిడి



తెలంగాణ ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ అన్నారు.

శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మంచి ఆప్తుడిని కోల్పోవడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. మూడు రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లి సుదర్శన్ రెడ్డిని పరామర్శించి, కుటుంబ సభ్యులు, వైద్యులతో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. త్వరలో కోలుకొని మళ్లీ ప్రజల్లోకి వస్తారని ఆశించానని, కానీ ఆయన ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించి, ఆ మార్గంలో నడవడమే పెద్ది సుదర్శన్ రెడ్డికి అందించే నిజమైన నివాళి అవుతుందని



## నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కి సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీ ఘన నివాళి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగన్న తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన కీలక పాత్రను, ఉద్యమ విజయానికి అందించిన సేవలను, పార్టీ బలోపేతానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. వారి నిరాడంబర నాయకత్వం, ప్రజాసేవ పట్ల అంకితభావం, ఉద్యమంలో మిగిల్చిన చిరస్మరణీయ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి,రాష్ట్ర నాయకులు గూడూరి ప్రవీణ్, మరియు నాయకులు, సెస్ డైరెక్టర్లు వర్స కృష్ణహరి, దార్నం లక్ష్మినారాయణ, ఫ్యాక్స్ చైర్మెన్లు గుండారపు కృష్ణరెడ్డి,బండి దేవదాస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంబాల మల్లారెడ్డి, గజభింకర్ రాజన్న, ఆకుల చిన్న, సంపత్, హరీష్, శ్రీనివాస్, అక్రమ్, అశోక్ రావు, సత్యనారాయణ, అజయ్, బాలకిషన్ కార్యకర్తలు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి కి ఘనంగా నివాళులర్పించారు.



# రింగులో భారత్ పంచ్ పవర్

**కామన్వెల్త్ ఫైనల్లోకి ప్రీతి, అంకుష్, అరుంధతి**

**సెమీస్‌లో ప్రత్యర్థులను చిత్తు చేసిన భారత బాక్సర్లు.. దేశానికి మరిన్ని పతకాలు ఖాయం**

**బలగం టీవీ, గ్లాస్గో**

కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. రింగులోకి దిగిన క్షణం నుంచే ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ పతకాల వేటలో దూసుకుపోతున్నారు. శుక్రవారం జరిగిన మహిళల సెమీఫైనల్స్ పోటీల్లో భారత స్టార్ బాక్సర్లు ప్రీతి పవార్, అంకుష్ పంగల్ అత్యంత ఆధిపత్య ప్రదర్శనతో ఫైనల్లోకి దూసుకెళ్లారు. దీనితో భారత్‌కు కనీసం రెండు రజత పతకాలు ఖాయమవడమే కాకుండా, స్వర్ణ పతకాల ఆశలు సజీవంగా నిలిచాయి. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్‌కు షాకిస్తూ అరుంధతి చౌదరి, ప్రపంచ ఛాంపియన్ జైస్మిన్ లాంబోరియా కూడా ఫైనల్ పోరుకు అర్హత సాధించి రింగులో భారత్‌కు తిరుగులేదని నిరూపించారు.

**ఏకపక్షంగా ప్రీతి, అంకుష్ పోరాటం**

జాంబియా బాక్సర్ కాథరిన్ మ్వాపేతో జరిగిన సెమీస్ పోరులో ప్రీతి పవార్ 5-0తో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే తన పంచ్‌లతో ప్రత్యర్థిని కోలుకోకుండా చేసింది. ప్రీతి ధాటికి తట్టుకోలేక జాంబియా బాక్సర్ మొదటి రెండు రౌండ్లలోనే మూడు సార్లు 'ఎయిట్ కౌంట్'ను ఎదుర్కొంది. రెండో రౌండ్లో ఐదుగురు జడ్జీలు ప్రీతికి అనుకూలంగా 10-8 పాయింట్లు ఇవ్వడం ఆమె ఆధిపత్యానికి నిదర్శనం.

మరోవైపు ఆసియా క్రీడల కాంస్య పతక విజేత, భివానీకి చెందిన 22 ఏళ్ల అంకుష్ పంగల్ కూడా సెమీస్ పోరులో కెనడాకు చెందిన స్కార్లెట్ డెల్గాడోపై అలవోక విజయాన్ని అందుకుంది. సౌత్‌పా (ఎడమచేతి వాటం) బాక్సర్ అయిన అంకుష్.. రైట్, లెఫ్ట్ కాంబినేషన్లతో కెనడియన్ బాక్సర్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పంచ్‌ల వర్షం కురిపించింది. శనివారం జరగబోయే ఫైనల్ పోరులో అంకుష్ స్వర్ణం కోసం తలపడనుంది.

**లక్ష్యం బంగారు పతకమే: ప్రీతి పవార్**

"నేను అనుకున్న ప్రణాళికను రింగులో విజయవంతంగా అమలు చేయడం సంతోషంగా ఉంది. శనివారం జరగబోయే ఫైనల్లో బంగారు పతకం కోసం నా శాయశక్తులా పోరాడుతాను. ప్రత్యర్థి ఎవరైనా తక్కువ అంచనా వేయను" అని మ్యాచ్ అనంతరం ప్రీతి ధీమా వ్యక్తం చేసింది.

**డిఫెండింగ్ ఛాంపియన్‌కు అరుంధతి షాక్:**

70 కేజీల విభాగంలో జరిగిన హోరాహోరీ పోరులో భారత బాక్సర్ అరుంధతి చౌదరి అద్భుత ఘనత సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్, వేల్స్ అథ్లెట్ రోసీ ఎక్లెస్‌ను స్ప్లిట్ డెసిషన్ ద్వారా ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. అదేవిధంగా ప్రపంచ ఛాంపియన్ జైస్మిన్ లాంబోరియా కూడా తన ప్రత్యర్థిపై ఘన విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. ఒకేరోజు నలుగురు భారత బాక్సర్లు ఫైనల్‌కు చేరడంతో శనివారం భారత పతకాల పట్టికలో స్వర్ణాల పంట పండటం ఖాయంగా కనిపిస్తోంది.



# డన్ వీధుల్లో రవిశాస్త్రితో 'శర్మజీ' ముచ్చట్లు.. నెట్టింట రోహిత్ నయా లుక్ వైరల్!

**క్లీన్ షేవ్‌తో అదరగొట్టిన హిట్ మ్యాన్.. రిటైర్మెంట్ రూమర్లకు తెరదించిన బీసీసీఐ..**

**లార్డ్స్ సెంచరీతో విమర్శకుల నోళ్లు మూయించిన భారత కెప్టెన్**

**బలగం టీవీ, లండన్**

ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన తర్వాత టీమిండియా స్టార్ బ్యాటర్, కెప్టెన్ రోహిత్ శర్మ లండన్‌లో ప్రశాంతంగా విహారయాత్రను ఆస్వాదిస్తున్నాడు. ఈ పర్యటనలో భాగంగా ఆయన టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రిని కలుసుకున్నాడు. లండన్ వీధుల్లో వీరిద్దరూ సరదాగా సమయాన్ని గడిపిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

**పూర్తి నయా లుక్‌లో హిట్ మ్యాన్:**

ఈ ఫోటోలో రోహిత్ శర్మ గతానికి భిన్నంగా పూర్తి నయా లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచాడు. క్లీన్ షేవ్ చేసుకుని, తెల్లటి జ్యామితీయ డిజైన్లు ఉన్న స్టైలిష్ బ్లాక్ హాఫ్-స్లీవ్ షర్ట్, నల్లటి ప్యాంటు ధరించి ఎంతో క్లాసీగా ఉన్నాడు. రవిశాస్త్రి తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఈ ఫోటోను పంచుకుంటూ.. "లండన్ పర్యటనలో ఎంతో రిలాక్స్‌గా ఉన్న మన శర్మజీని కలవడం చాలా సంతోషంగా ఉంది!" అని సరదాగా క్యాప్షన్ జత చేశారు.

**రిటైర్మెంట్ రూమర్లు.. ఖండించిన బీసీసీఐ:**

ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లలో రోహిత్ కేవలం 11, 26 పరుగులకే పరిమితమవడంతో ఆయన రిటైర్మెంట్‌పై సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. లార్డ్స్‌లో జరిగే వన్డేనే రోహిత్ శర్మకు చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావచ్చని పలు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలను బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా తీవ్రంగా ఖండించారు. టీమిండియా భవిష్యత్ ప్రణాళికలలో రోహిత్ శర్మ అత్యంత కీలకమైన భాగమని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు తన రిటైర్మెంట్‌పై వస్తున్న విమర్శకులకు రోహిత్ శర్మ తన బ్యాట్‌తోనే సమాధానమిచ్చాడు. లార్డ్స్‌లో జరిగిన వన్డేలో కేవలం 110 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 138 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ

# భారత్‌కు బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు.. కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్

**అక్టోబర్ 3న బ్లూ టైగర్స్‌తో సాల్ట్ లేక్ స్టేడియంలో పోరు**

**మొట్టమొదటిసారి భారత గడ్డపై అడుగుపెట్టనున్న బ్రెజిల్ సీనియర్ జట్టు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




భారత ఫుట్‌బాల్ అభిమానులకు శుభవార్త. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం బ్రెజిల్ సీనియర్ జాతీయ జట్టు తొలిసారిగా భారత పర్యటనకు రానుంది. అక్టోబర్ 3న కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో భారత జట్టు (బ్లూ టైగర్స్)తో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనున్నట్లు బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య (సీబీఎఫ్) శుక్రవారం అధికారికంగా ప్రకటించింది.

ఫిఫా వరల్డ్‌కప్ అనంతరం బ్రెజిల్ జట్టు భారత పర్యటన ఖరారవడంతో ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఫుట్‌బాల్‌కు కేరాఫ్‌గా పేరొందిన కోల్‌కతాలో జరిగే ఈ మ్యాచ్‌కు భారీ స్పందన లభించే అవకాశం ఉంది. ఇటీవల 'ది గోట్ ఇండియా టూర్' సందర్భంగా అంతర్జాతీయ ఫుట్‌బాల్ తారల సందడి చూసిన సాల్ట్ లేక్ స్టేడియం మరోసారి ప్రపంచ స్థాయి మ్యాచ్‌కు వేదిక కానుంది.

ఈ సందర్భంగా సీబీఎఫ్ విడుదల చేసిన ప్రకటనలో.. ఆస్ట్రేలియాతో ఫ్రెండ్లీ మ్యాచ్ అనంతరం తమ తదుపరి పర్యటన భారత్‌లోనే ఉంటుందని తెలిపింది. బ్రెజిల్ ఫుట్‌బాల్ చరిత్రలో భారత పర్యటన ఒక కొత్త అధ్యాయమని పేర్కొంది. అక్టోబర్ 3న కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో భారత జట్టుతో తొలి మ్యాచ్ ఆడనున్నామని వెల్లడించింది.

కోల్‌కతాలో బ్రెజిల్ జట్టుకు అపారమైన అభిమానులున్నారని, అక్కడ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడడం తమకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని సీబీఎఫ్ పేర్కొంది. ఈ పర్యటన కోసం తాము ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని వెల్లడించింది.

కాగా, నెయ్‌మర్ సారథ్యంలో బరిలోకి దిగిన బ్రెజిల్ జట్టు ఫిఫా వరల్డ్‌కప్-2026లో నాకౌట్ దశలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.

# డిస్కస్ త్రోలో మెరిసిన సీమా కాలీరమణ

**కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు కాంస్యం:**

**మూడో ప్రయత్నంలో 58.65 మీటర్ల దూరం విసిరి పతకం కైవసం..**

**తృటిలో పతకం చేజార్చుకుని నాల్గో స్థానంలో నిలిచిన నిధి రాణి**

**బలగం టీవీ, గ్లాస్గో**



కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిష్ఠాత్మక మహిళల డిస్కస్ త్రో ఈవెంట్‌లో భారత స్టార్ అథ్లెట్ సీమా కాలీరమణ అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకాన్ని ముద్దాడారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో ఆమె తన మూడవ ప్రయత్నంలో డిస్కస్‌ను అత్యంత ప్రతిభావంతంగా 58.65 మీటర్ల దూరం విసిరి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

పోటీల వివరాల్లోకి వెళితే.. సీమా కాలీరమణకు ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. తన నాలుగవ, ఐదవ, మరియు ఆరవ ప్రయత్నాల్లో ఆమె వరుసగా ఫౌల్స్ చేసినప్పటికీ, మూడో రౌండ్‌లో ఆమె నమోదు చేసిన అత్యుత్తమ త్రోనే భారత్‌కు కాంస్య పతకాన్ని ఖాయం చేసింది. ఇదే ఈవెంట్‌లో పాల్గొన్న మరో భారత ప్లేయర్ నిధి రాణి సైతం గట్టి పోటీనిచ్చినప్పటికీ, తృటిలో పతకాన్ని చేజార్చుకుని నాల్గో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**మాతృత్వపు మైలురాయి దాటి.. పీహెచ్‌డీ చదువుతూనే పతక సాధన:**

ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చిన సీమా కాలీరమణ, మాతృత్వపు బాధ్యతలను నిర్వహిస్తూనే మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టి డిస్కస్ త్రోలో అద్భుతంగా రాణిస్తుండటం గమనార్హం. ప్రస్తుతం పీహెచ్‌డీ చదువుతున్న ఆమె, 2025 నేషనల్ గేమ్స్‌లో కూడా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని తన ఫామ్‌ను నిరూపించుకున్నారు.

ఇక ఈ ఈవెంట్‌లో జమైకాకు చెందిన సమంతా హాల్ డిస్కస్‌ను ఏకంగా 61.66 మీటర్ల దూరం విసిరి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, కెనడాకు చెందిన జూలియా టంక్స్ 60.67 మీటర్ల ప్రదర్శనతో రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.

**పతకాల పట్టికలో 10వ స్థానంలో భారత్:**

ఎనిమిదో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ మొత్తం 17 పతకాలతో (3 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలు) పట్టికలో 10వ స్థానంలో కొనసాగుతోంది. కాగా, ఆస్ట్రేలియా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ మొత్తం 110 పతకాలతో అగ్రస్థానంలో దూసుకుపోతోంది.

# జుడోలో భారత 'డబుల్ ధమాకా':

**కామన్వెల్త్‌లో సరికొత్త చరిత్ర సృష్టించిన అస్మిత, హర్ష్ సింగ్**

**ఒకే రోజు రెండు చారిత్రాత్మక స్వర్ణాలు సాధించిన భారత్.. కెనడా, ఆస్ట్రేలియా ఆటగాళ్లపై ఘన విజయం.. అభినందించిన ప్రధాని మోదీ**

**బలగం టీవీ, గ్లాస్గో**



కామన్వెల్త్ క్రీడలు 2026లో భారత క్రీడాకారులు అద్భుత చరిత్రను లిఖించారు. ఇన్నాళ్లుగా ఊరిస్తున్న పసిడి పతకాల నిరీక్షణకు జుడో క్రీడాకారులు తెరదించారు. శుక్రవారం (జూలై 31) గ్లాస్గో వేదికగా జరిగిన జుడో పోటీల్లో భారత్ ఒకే రోజు రెండు చారిత్రాత్మక స్వర్ణ పతకాలను కొల్లగొట్టి 'డబుల్ ధమాకా' సృష్టించింది. మహిళల 48 కేజీల విభాగంలో అస్మిత దే, పురుషుల 60 కేజీల విభాగంలో హర్ష్ సింగ్ అద్భుత ప్రదర్శనతో పసిడి పతకాలను ముద్దాడి దేశ కీర్తి పతాకాన్ని ఎగరవేశారు.

చరిత్ర సృష్టించిన త్రిపుర కణిటి 'అస్మిత': మహిళల 48 కేజీల జుడో ఫైనల్ సమరంలో త్రిపురకు చెందిన రైజింగ్ స్టార్ అస్మిత దే కెనడాకు చెందిన హెయిడీ క్యాచ్‌ను 'యుకో' (2-1) తేడాతో చిత్తు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. కామన్వెల్త్ క్రీడల చరిత్రలోనే జుడోలో స్వర్ణం సాధించిన మొట్టమొదటి భారతీయ జుడోకాగా అస్మిత చరిత్ర పుటల్లోకెక్కింది. నాలుగు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ ఆరంభంలో అస్మిత ఒత్తిడికి లోనై వెనుకంజలో నిలిచినప్పటికీ, ఆ తర్వాత దూకుడు పెంచి స్కోరును 1-1తో సమం చేసింది. నిర్ణీత సమయంలో విజేత తేలకపోవడంతో మ్యాచ్ 'గోల్డెన్ స్కోర్' (సడన్ డెత్) పీరియడ్‌కు దారితీసింది. ఈ ఉత్కంఠభరిత క్షణాల్లో అస్మిత తన ఏకాగ్రతను కోల్పోకుండా నిర్ణయాత్మకమైన దాడితో 'యుకో' పాయింట్ సాధించి చారిత్రాత్మక స్వర్ణాన్ని ఖాయం చేసుకుంది.

ఆస్ట్రేలియా ఒలింపియన్‌ను మట్టికరిపించిన 'హర్ష్ సింగ్': అస్మిత విజయం ఇచ్చిన ఉత్సాహంతో పురుషుల 60 కేజీల ఫైనల్లో బరిలోకి దిగిన 23 ఏళ్ల భారత యువ జుడోకా హర్ష్ సింగ్ మరో అద్భుతాన్ని ఆవిష్కరించాడు. తన తొలి కామన్వెల్త్ క్రీడల్లోనే బరిలోకి దిగిన హర్ష్.. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రేలియా సీనియర్ ఒలింపియన్ జాషువా కాట్జ్‌ను 'వజా-అరి' (10-0) తేడాతో మట్టికరిపించాడు. ఈ విజయంతో కామన్వెల్త్ క్రీడల్లో జుడో విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారతీయ పురుష జుడోకాగా హర్ష్ సింగ్ రికార్డు సృష్టించాడు. మ్యాచ్ ముగియడానికి మరో నిమిషం కంటే తక్కువ సమయం ఉందనగా (3:19 నిమిషాల వద్ద), హర్ష్ తన అద్భుతమైన స్కిల్‌తో ప్రత్యర్థిని కిందకు పడేసి పిన్ (throw and pin) చేయడం ద్వారా 'వజా-అరి' పాయింట్ సాధించి భారత్‌కు రెండో స్వర్ణాన్ని అందించాడు.

ప్రధాని మోదీ ప్రశంసలు - 8వ స్థానానికి భారత్: ఒకే రోజు జుడోలో రెండు చారిత్రాత్మక స్వర్ణ పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచిన అస్మిత దే, హర్ష్ సింగ్‌లను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ అద్భుత విజయాలతో పతకాల పట్టికలో భారత్ 8వ స్థానానికి ఎగబాకింది.

# డబ్ల్యూటీసీ ఫైనల్ వేటలో టీమిండియా




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

లంక పర్యటనకు గిల్ సేన సిద్ధం!ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం.. ఫైనల్ చేరాలంటే తదుపరి 9 మ్యాచ్‌ల్లో 7 గెలవడం అత్యంత కీలకంహైదరాబాద్, జూలై 31 (న్యూస్ సర్వీస్): సుదీర్ఘ విరామం తర్వాత భారత క్రికెట్ జట్టు మళ్లీ రెడ్ బాల్ (టెస్ట్) క్రికెట్ ఆడేందుకు సిద్ధమైంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) 2025-27 ఎడిషన్‌లో భాగంగా రెండు టెస్టుల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఆగస్ట్ 15 నుంచి ఈ ప్రతిష్టాత్మక సిరీస్ ప్రారంభం కానుంది. షెడ్యూల్ ప్రకారం.. తొలి టెస్ట్ మ్యాచ్ ఆగస్ట్ 19 వరకు గాలె వేదికగా జరగనుండగా, రెండో టెస్ట్ మ్యాచ్ ఆగస్ట్ 23 నుంచి 27 వరకు కొలంబో వేదికగా నిర్వహించనున్నారు.

యువ కెప్టెన్ గిల్ సారథ్యంలో 15 మంది సభ్యుల జట్టు

ఈ పర్యటన కోసం బీసీసీఐ ఇప్పటికే శుభ్‌మన్ గిల్ సారథ్యంలో 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. అయితే గాయాల కారణంగా కీలక ఆటగాళ్లు వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా ఈ సిరీస్‌కు దూరమయ్యారు. మరోవైపు సాయి సుదర్శన్, జస్‌ప్రీత్ బుమ్రాలు జట్టులో స్థానం దక్కించుకున్నప్పటికీ, వారు బరిలోకి దిగేందుకు ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది. ఫైనల్ చేరాలంటే లంక సిరీస్ 'డూ ఆర్ డై':

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ప్రస్తుతం భారత్ ఐదో స్థానానికి పడిపోవడంతో ఈ సిరీస్ గెలవడం జట్టుకు అత్యంత కీలకంగా మారింది. ప్రస్తుత సైకిల్‌లో టీమిండియా ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 4 గెలిచి, 4 ఓడి, ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుని 48.15 విన్నింగ్ పర్సంటేజీతో ఐదో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం 87.50 శాతం విన్నింగ్ రేటుతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో, 75 శాతంతో సౌతాఫ్రికా రెండో స్థానంలో, 72.22 శాతంతో న్యూజిలాండ్ మూడో స్థానంలో, 58.33 శాతంతో బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాయి. 9 మ్యాచ్‌ల్లో 7 విజయాలు తప్పనిసరి:

నిబంధనల ప్రకారం టాప్-2 లో నిలిచిన జట్లే డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడతాయి. భారత్ ఫైనల్ చేరాలంటే ఈ సైకిల్‌లో మిగిలి ఉన్న 9 మ్యాచ్‌ల్లో కనీసం 7 మ్యాచ్‌లు గెలవాల్సి ఉంటుంది. భారత్ ఆడబోయే తదుపరి మ్యాచ్‌ల్లో శ్రీలంకతో రెండు, న్యూజిలాండ్‌తో రెండు అవే (సొంతగడ్డ వెలుపల) సిరీస్‌లు ఉండగా, ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై ప్రతిష్టాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. రాబోయే సవాళ్లతో పోలిస్తే శ్రీలంక సులువైన ప్రత్యర్థి కాబట్టి, ఇక్కడ క్లీన్ స్వీప్ చేస్తే భారత్ ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. గౌతమ్ గంభీర్ పర్యవేక్షణపై ఒత్తిడి:

గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి టెస్టుల్లో భారత జట్టు ప్రదర్శన ఆందోళనకరంగా మారింది. గతేడాది నవంబర్‌లో సొంతగడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను సౌతాఫ్రికా 2-0తో క్లీన్ స్వీప్ చేయడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మరి ఈ లంక పర్యటనతో గంభీర్ సేన మళ్లీ విజయాల బాట పట్టి, పరాజయాల పరంపరకు బ్రేక్ వేస్తుందో లేదో వేచి చూడాలి.

# పంత్, షమీ వద్దు.. భువీ ముద్దు'..

**'2027 వన్డే ప్రపంచకప్‌పై అశ్విన్ సంచలన వ్యాఖ్యలు!**

**సౌతాఫ్రికా పిచ్‌లకు ఆ 36 ఏళ్ల సీనియర్ బౌలరే కరెక్ట్.. దేశవాళీ ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి: టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రతిపాదన**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



2027 వన్డే ప్రపంచకప్‌నకు టీమిండియా సన్నద్ధతపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ మెగా టోర్నీ కోసం తన ప్రతిపాదిత భారత జట్టును ప్రకటించిన అశ్విన్.. కొన్ని సంచలన నిర్ణయాలతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. జట్టులో కీలక ఆటగాళ్లైన రిషభ్ పంత్, మహమ్మద్ షమీ వంటి సీనియర్ల అవసరం భారత్‌కు లేదని స్పష్టం చేసిన అశ్విన్.. సుదీర్ఘ కాలంగా వన్డే జట్టుకు దూరంగా ఉంటున్న 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్‌ను కచ్చితంగా జట్టులోకి తీసుకోవాలని పట్టుబట్టాడు. కాగా, భువీ భారత్ తరఫున చివరి వన్డే మ్యాచ్‌ను 2022 జనవరిలో ఆడటం గమనార్హం.

**దక్షిణాఫ్రికా పిచ్‌లకు భువీయే కరెక్ట్:**

తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా వన్డే ప్రపంచకప్ 2027 జట్టు ఎంపికపై అశ్విన్ సుదీర్ఘంగా మాట్లాడాడు. రాబోయే ప్రపంచకప్ జరగనున్న సౌతాఫ్రికా కండిషన్స్‌కు భువనేశ్వర్ కుమార్ బౌలింగ్ శైలి సరిగ్గా సరిపోతుందని అభిప్రాయపడ్డాడు. "సౌతాఫ్రికా పిచ్‌లపై భువనేశ్వర్ కుమార్ లాంటి స్వింగ్ బౌలర్ ఉంటే టీమిండియాకు కొండంత బలం. అతని అనుభవం జట్టుకు ఎంతో కలిసొస్తుంది. అయితే భువీ వెంటనే ఫస్ట్ క్లాస్ క్రికెట్, విజయ్ హజారే ట్రోఫీ వంటి దేశవాళీ టోర్నీలు ఆడి తన ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి" అని అశ్విన్ మేనేజ్‌మెంట్‌కు, భువీకి సలహా ఇచ్చాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంలో భువీ 28 వికెట్లతో కీలక పాత్ర పోషించడమే కాకుండా, ఐపీఎల్ 2025లోనూ మెరుగ్గా రాణించిన సంగతిని ఈ సందర్భంగా క్రీడా విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

**పంత్, షమీలకు నో ఛాన్స్.. రాహుల్, కిషన్‌లకు మొగ్గు:**

న్ ఎంపిక చేసిన ఈ జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌తో పాటు సంజూ శాంసన్, మహమ్మద్ షమీ, వాషింగ్టన్ సుందర్‌లకు చోటు దక్కలేదు. అలాగే కుర్రాళ్లైన వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రవిబిష్ణోయ్‌లను కూడా పక్కన పెట్టాడు. అయితే యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, రవీంద్ర జడేజా, అర్షదీప్ సింగ్‌లకు మాత్రం అవకాశం దక్కవచ్చని పేర్కొన్నాడు. ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌ను ఎంచుకున్న అశ్విన్, బ్యాకప్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌కు మొగ్గు చూపాడు.

**అశ్విన్ మెచ్చిన 'ప్రపంచకప్' జట్టు ఇదే:**

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ , కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

## ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన

ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా,



మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్సలలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని కూడా తన అందం, అభినయంతో తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి వన్యాయం చేశారు. కిక్ శ్యామ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్‌ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది. దర్శకుడు అజయ్ భూపతి ఎంచుకున్న లవ్ అండ్ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్ బాగుంది. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. ముఖ్యంగా స్క్రీన్ పై పాటలు మరింత రిచ్‌గా కనిపిస్తాయి.




# లెనిన్ సరికొత్త రికార్డులు




## వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2






అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టాగ్గంట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎలాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ భారీ పోటీతో టాలీవుడ్ వర్సెస్ కోలీవుడ్ బాక్సాఫీస్ వార్ తారాస్థాయికి చేరడం ఖాయమని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు.

# రామాయణ ట్రైలర్ విడుదల

## అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను




జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ కేవలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బ్జడెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.






